ప్రజాశక్తి

శుక్రవారం 24 ఫిబ్రవరి 2023   8 పేజీలు





ఎన్‌టిఆర్   కృష్ణా



అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంత్రులు తానేటి, అంబటి, బొత్స, మేయర్ రాయన, డిప్యూటీ మేయర్లు దుర్గ, శ్రీశైలజారెడ్డి తదితరులు

పేదల సంక్షేమమే లక్ష్యం

- మంత్రులు తానేటి, అంబటి, బొత్స
- 'సెంట్రల్'లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : పేదవర్గాల ప్రజల ఆర్థిక ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న ప్రతి ఆలోచన పేదవాని సంక్షేమం కోసమేనని రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, బొత్ససత్యనారాయణ అన్నారు. గురువారం జరిగిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ కండ్రిక జంక్షన్ వద్ద రూ.3.65 కోట్ల వ్యయంతో నూజివీడు రోడ్డు అభివృద్ధి పనులకు, 62వ డివిజన్ ఎల్‌బిఎస్ నగర్‌లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే కాపు కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన, 58వ డివిజన్‌లో రూ.1.06 కోట్ల నిర్మించిన అర్బన్ ప్రైమరీ సెంటర్ ప్రారంభోత్సవాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం రాజరాజేశ్వరీ పేటలో పేదలకు రిజిస్ట్రేషన్ రాయితీని కల్పిస్తూ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఏదో ఒక

(మిగతా 6లో)

నేడు గన్నవరంలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం కృష్ణాజిల్లా గన్నవరంలో పర్యటించనున్నారు. ఎంఎల్ఎ వంశీ అనుచరుల దాడిలో ధ్వంసమైన గన్నవరంలోని టిడిపి కార్యాలయాన్ని పరిశీలిస్తారు. టిడిపి నాయకులు దొంతు చిన్నా కుటుంబాన్ని పరామర్శిస్తారు.

సిఐ కనకారావుకు హోం మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గన్నవరం ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీఐ కనకారావును రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, ఎంఎల్ఎ విష్ణు పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ...ఇలాంటి దాడులను పూర్తిగా ఖండిస్తున్నామని, 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పోలీసులను కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు. పట్టాభిపై పోలీసులు ఎటువంటి థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదన్నారు.

చిల్లకల్లు బస్సు ప్రమాద ఘటనలో

క్షతగాత్రులను పట్టించుకోని ఆర్‌టిసి



ప్రజాశక్తి-విజయవాడ: ప్రయాణికుల పట్ల ఆర్‌టిసి ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఎన్‌టిఆర్ జిల్లా చిల్లకల్లు వద్ద జరిగిన గరుడ బస్సు బోల్తాపడి 12 మంది గాయపడగా, వీరిలో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణంగా ఆర్‌టిసి నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. ప్రమాదం జరిగిన తరువాత కూడా క్షతగాత్రులను ఆదుకోవడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. క్షతగాత్రులు దయనీయ స్థితిలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా వారిని పరామర్శించడంగానీ, ఆదుకోవడంగానీ ఆర్‌టిసి అధికారులు చేయడంలేదు. క్షతగాగ్రులను పూర్తిగా విస్మరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. చేతిని కోల్పోయి దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్న తోట ఆదిత్య అనే క్షత్రగాత్రుడి కుటుంబం కూడా ఆర్టీసికి చెందినదైనప్పటికీ కన్నెత్తి చూడటానికి సంబంధిత జిల్లా అధికారులకు తీరిక లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రమాదాలకు గురైతే ఆర్‌టిసి స్పందించే తీరు ఇలా ఉంటుందా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం... శుభప్రదం... అనే మాటలు నినాదాలకే పరిమితమన్నట్లుగా ఈ ఘటన మరోసారి రోజువు చేస్తోంటున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఎపిఎస్‌ఆర్‌టిసి గరుడా బస్సు బోల్తాపడింది. ముందున్న హెడ్ లైట్లు ఫెయిలవ్వడంతో బస్సును ఆపాలని ప్రయాణికులు కోరినా డ్రైవర్ ఏమాత్రం లెక్క చేయకుండా అలాగే చీకటి రోడ్డుపై నడపడంతో ఈ ఘోరమైన ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకున్నా ఈ ప్రమాదం జరిగేది కాదని వారు వివరిస్తున్నారు. బస్సులో సమస్యలుంటే హైదరాబాద్ వెళ్లే వేరే బస్సులో ఎక్కిస్తే ఈ ఘోరం జరిగేది కాదని క్షత్రగాత్రులు అంటున్నారు.

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిన ఆకుల

ప్రజాశక్తి - భవానీపురం : ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. శ్రీనివాసరావుకు సిఎం జగన్ వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంఎల్‌సి రహతుల్లా, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రణాళికతోనే

గన్నవరంలో గొడవలు



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్

ఎంఎల్ఎ వల్లభనేని వంశీ

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరంలో జరిగిన రాజకీయ గొడవల వెనుక చంద్రబాబు పక్కా ప్రణాళిక ఉందని, అందులో భాగంగానే విజయవాడ పరిసరాల నుండి 60 మంది సంఘ విద్రోహ శక్తులను గన్నవరం పంపారని ఎంఎల్ఎ డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విమర్శించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో చదువుతున్న ఆయన గురువారం మొహాలికి బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఐఎస్‌బిలో సెమిస్టర్ పరీక్షలు రాయడానికి 15 రోజులపాటు మొహాలిలో ఉంటానని తెలిపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు పెనమలూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుండి 60 మంది సంఘ విద్రోహ శక్తులు గన్నవరంలో రగడ చేసేందుకు వచ్చారని, తీరా అందుకు విరుద్ధంగా జరగడంతో చంద్రబాబుకు, టిడిపికి షాక్ తగిలిందన్నారు. విజయవాడ నుంచి వచ్చిన వ్యక్తులను తాను గుర్తుపట్టగలనని చెప్పారు. పట్టాభి...స్కూల్ అఫ్ రాజమండ్రికి వెళ్లారని, తాను మొహాలి స్కూల్‌కు వెళుతున్నానని, ఇక చంద్రబాబు ఓల్డ్ విలన్ రాజనాల స్కూల్‌కు వెళుతున్నారని తెలిపారు. గన్నవరంలో వైసిపి వారు గొడవలు చేస్తే....టిడిపి నాయకులపై కేసులు పెట్టారని, దీని వెనుక మీ పాత్ర ఉందని వస్తున్న విమర్శలపై విలేకరులు ఎంఎల్ఎ వంశీని ప్రశ్నించగా, అసలు గన్నవరంలో వైసిపి వారు గొడవలు చేసినట్లు పోలీస్ స్టేషన్లో మూడు రోజుల వరకు ఫిర్యాదు నమోదు కాలేదన్నారు. జిల్లా ఎస్పి సూచనతో టిడిపి నేతలు మాజీ ఎంపి కొనకళ్ల నారాయణను పంపి స్టేషన్లో ఫిర్యాదు ఇప్పించారని చెప్పారు. ఆయన పెద్ద మనిషి కావడంతో ఎవరు ఏమీ అనరనే ధైర్యంతో పంపారని పేర్కొన్నారు. దీంతో పోలీసులు తమ పని తాము చేస్తున్నారని పేర్కొన్నారు. 15 రోజులు బయటకు వెళుతున్నందున గన్నవరంలో గొడవలు సద్దుమణిగినట్లేనా అని ప్రశ్నించగా, తాను వెళ్లినా గన్నవరం ఇక్కడే ఉంటుందని, చంద్రబాబు మాదిరిగా తాను లేకపోతే రాష్ట్రమే లేదు అన్నట్లుగా మాట్లాడడం తనకు చేతకాదని పేర్కొన్నారు. బయట నుండి వచ్చి తొడలు కొట్టి, రెచ్చగొట్టి వెళ్దామని అనుకుంటే గన్నవరంలో కుదరదన్నారు. చంద్రబాబుకు ఏ సమస్య వచ్చినా ప్రపంచ సమస్యగా ప్రచారం చేయడం అలవాటన్నారు. కొన్ని పత్రికలు కావాలనే గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా కాల్‌మనీ సెక్స్ రాకెట్ విషయంలో ఏం చేశారని ప్రశ్నించారు. సరిగా మాట్లాడడం రాని నారా లోకేష్ కు భయపడే వాడెవరూ ఇక్కడ లేరన్నారు. అచ్చెన్నాయుడు టిడిపి లేదు...బొక్కా లేదు...గట్టి చెట్నీ వేయ్... అన్న విషయాన్ని గుర్తుచేశారు. అచ్చెన్నాయుడు ఓ మహిళా ఐఎఎస్ అధికారిపై అసభ్యంగా వ్యవహరించిన విషయంలో చంద్రబాబు కాళ్లు పట్టుకున్నారని, ఇంకా తాను నోరు తెరిస్తే ఎన్నో విషయాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఆ చిట్టా మొత్తం తనకు తెలుసునన్నారు. అచ్చెన్నాయుడు తన గురించి మాట్లాడితే చిట్టా మొత్తం విప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. విజయవాడ చుట్టుపక్కల నుండి రౌడీలు గన్నవరం వచ్చి వైసిపి కార్యకర్తలు, పోలీసులపై దాడి చేశారని అన్నారు.

విజయవాడలో కిడ్నాప్... బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద దాడి...

ప్రియుడిని వదిలించుకునేందుకు మహిళ యత్నం



ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

భార్యను విడిచి మరో మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తిపై ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో అదే మహిళ...కిరాయి గుండాలతో ప్రియుడిని కిడ్నాప్ చేయించి దాడి చేయించిన ఘటన గురువారం మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వెలుగుచూసింది. స్థానిక పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా దరిశి పట్టణం కురిచేడు రోడ్డులోని శివాజీనగర్‌కు చెందిన వద్ది నాగరాజు పండ్ల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. 15 సంవత్సరాల క్రితం వెంకటేశ్వరమ్మతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అయితే గత రెండేళ్లుగా భార్యా పిల్లలను వదిలిపెట్టిన నాగరాజు విజయవాడలో ఓ న్యూట్రిషన్ ఫుడ్ సెంటర్ నడుపుతున్న సంతోష్ కుమారి అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత కొద్దిరోజులుగా సదరు మహిళపై అనుమానం పెంచుకున్న నాగరాజు డబ్బుల విషయమై ఆమెతో తరచూగొడవ పడుతున్నాడు. నాగరాజు ప్రవర్తనతో విసిగిపోయిన సంతోష్ కుమారి కొద్దిరోజులుగా ఆయనకు దూరంగా ఉంటోంది. ఎలాగైనా నాగరాజు బెడద వదిలించుకోవాలనే ఉద్దేశంతో కిరాయి వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకొంది. విజయవాడ బస్టాండ్ వద్దకు వస్తే మాట్లాడుకుందామని బుధవారం రాత్రి సంతోష్ కుమారి ఫోన్ చేయడంతో నాగరాజు అక్కడికి వచ్చాడు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఐదుగురు వ్యక్తులు ఒక్కసారిగా నాగరాజుపై దాడి చేశారు. బలవంతంగా కారులో ఎక్కించి మార్టూరు వైపు తీసుకెళ్లారు. కారులోనే నాగరాజుపై బ్లేడ్‌తో విచక్షణారహితంగా దాడిచేసి చిత్రహింసలకు గురిచేశారు. కారు మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే నాగరాజును సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. నాగరాజు మతి చెందాడనుకుని రోడ్డు పక్కన పడేసి వచ్చిన కారులో పరారయ్యారు. కొద్దిసేపటికి తేరుకున్న

(మిగతా 6లో)



రవీంద్రభారతి 40వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నందిగామ: రైతుపేటలోని విజయవాడ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ 40వ వార్షికోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ స్కూల్ ఆటలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, ఎకడమిక్ డైరెక్టర్ శాంతి, జోనల్ ఇన్చార్జి రమేష్, ప్రిన్సిపల్ రాము, జిఎం రాజేష్, జోనల్ హెడ్ రమేష్ పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు సన్నాహాలు

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: గ్రామ పంచాయతీల్లో ఖాళీగా వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో తొమ్మిదో వార్డు సభ్యుడు పొలారెడ్డి రంగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జనవరి ఐదో తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఖాళీ అయిన స్థానాలకు ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నారు. ఓటర్ల తుది జాబితాను ఈ నెల 27న ప్రకటించనున్నారు. అనంతరం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

2న టిడ్కో లబ్ధిదారులతో ధర్నా

ప్రజాశక్తి-సింగ్‌నగర్: టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల రెండో తేదీన ధర్నా విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కెవి భాస్కరరావు అన్నారు.



గురువారం 59వ డివిజన్లో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో సంతకం సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు డబ్బులు కట్టాలని లేదంటే పట్టాలు రద్దు చేస్తామని వాలంటీరీలు లబ్ధిదారులను బెదిరిస్తున్నారన్నారు. విజయవాడలో జరిగే ధర్నాలో లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎస్‌కె సుభాని, నాయకులు ఆదినారాయణ, ఎ.రవికుమార్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

1న వాహనాల వేలం

ప్రజాశక్తి-సింగ్‌నగర్: నున్న పోలీస్ స్టేషన్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన 16 వాహనాలకు మార్చి ఒకటో తేదీన నున్న పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కాగిత శ్రీనివాసరావు కోరారు. పూర్తి వివరాలకు 9989786100, 7569944532,9490619463 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

బడి బయట పిల్లలపై సమీక్ష

ప్రజాశక్తి-కంచికచర్ల: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరావు అన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో గురువారం బడి బయట పిల్లలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ చదువుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌కుమార్, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్రాభివృద్ధికే టిడిపిలో చేరిక : కన్నా

భారీ ర్యాలీతో తరలి వెళ్లిన వైనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ అనుచరులు, మద్దతుదారులతో గురువారం మధ్యాహ్నం టిడిపిలో చేరారు. అంతకు ముందు ఆయన తన అనుచరులతో గుంటూరు నుంచి భారీ ర్యాలీగా మంగళగిరి చేరుకున్నారు. ఆయనకు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళగిరి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చంద్రబాబు కన్నాకు పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కన్నాకు స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. కన్నా నిత్యం ప్రజల్లో ఉంటారని అన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వ్యక్తి అని, హుందా తనంతో వ్యవహరిస్తారని, అన్నారు. గతంలో రాజకీయంగా కన్నాతో విభేదించామని వ్యక్తిగతంగా ఎప్పుడూ విమర్శించుకోలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి కోసం కలిసి వచ్చిన కన్నాను ఆహ్వానిస్తున్నామని అన్నారు. బిజెపిని కాదని ప్రతిపక్షంలో ఉన్న టిడిపిలో చేరి రాజధానిగా అమరావతి ఉండాలని బలంగా ఆకాంక్షించిన వ్యక్తి కన్నా అని కొనియాడారు. కన్నా అనుభవం టిడిపికి బలం చేకూరుస్తుందన్నారు. కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగు దేశంలో చేరానని తెలిపారు.



చంద్రబాబునాయుడుతో కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు తదితరులు

1 నుంచి రాజధాని వాలంటీర్లకు పెన్షన్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామాల్లోని వాలంటీర్‌లకు మార్చి 1 నుంచి నెలవారీ అమరావతి సామాజిక పెన్షన్ రూ 2,500లు ప్రభుత్వం చెల్లించనుంది. అమరావతి రాజధానిలో భూమిలేని పేదలకు గత ప్రభుత్వం ప్రతినెలా పెన్షన్ రూ 2,500లు చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. వైసిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసింది. వారికి ప్రతి నెలా రూ 5 వేలు చెల్లిస్తుంది. అయితే రాజధాని గ్రామాల్లో ఉన్న భూమిలేని నిరుపేదలైన వాలంటీర్‌లకు పెన్షన్ రూ 2,500లను నిలిపివేసింది. వాలంటీర్ లను ఉద్యోగులుగా పేర్కొంటూ 2,500లు పెన్షన్ నిలిపివేయడంతో వాలంటీర్లు తీవ్ర అసంతృప్తి కి గురయ్యారు. తమకు ఇచ్చే రూ 5 వేలు ఏమాత్రం సరిపోవని, రాజధానిలో భూమిలేని తమకు ఇచ్చే రూ 2,500లు పెన్షన్ ను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించు కావాలని వాలంటీర్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

కల్చరల్ విభాగం అధ్యక్షురాలిగా ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ నుండి ఎన్టీఆర్ జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన మద్దు ఆదిలక్ష్మి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుని గురువారం భవానీపురం పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మద్దు ఆదిలక్ష్మి ఎమ్మెల్యే వెలంపల్లి శాలువాతో సత్కరించి శుభాకంక్షలు తెలిపారు. ఆదిలక్ష్మికి స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కంది శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు మాదాల తిరుపతిరావు, దుర్గేశుల హుస్సేన్, శ్రీనివాసు శుభాకాంక్షలు తెలిపారు.



విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి

- కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ భాస్కర్
- డాక్టర్ లక్కిరెడ్డి హనుమరెడ్డికి విద్యాదాన శిరోమణి బిరుదు ప్రదానం

ప్రజాశక్తి - మైలవరం : విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి విద్యా ప్రమాణాలను పెంచడానికి ప్రభుత్వం విశేషంగా కషి చేస్తోందని కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు కళాశాలల్లో మౌలిక వసతులు పెంచడం ద్వారా విద్యా ప్రమాణాల పెరుగుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కషి చేస్తున్నారని అన్నారు. మైలవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడిటోరియం తరగతి గదులను డాక్టర్ పోలా భాస్కర్ గురువారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్ , ఆడిటోరియం, 10 తరగతి గదులను ప్రారంభించారు. కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ నెలకొల్పిన స్కిల్ హబ్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలా భాస్కర్, ప్రత్యేక అతిథిగా ఏపీ ఎస్ఎస్సిసి చైర్మన్ కొండూరు రాజారెడ్డి, విశిష్ట అతిథిగా డాక్టర్ లక్కిరెడ్డి హనుమ రెడ్డి, గౌరవ అతిథులుగా డాక్టర్ లక్కిరెడ్డి విక్రం, లక్కిరెడ్డి సిద్ధార్థ, స్థానిక ఏసిపి ఎం రమేష్ పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్లా రవి అధ్యక్షత జరిగిన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్య కోసం డాక్టర్ లక్కిరెడ్డి హనుమ రెడ్డి చేస్తున్న కృషికిగాను డాక్టర్ ఆయనకు విద్యాదాన శిరోమణి బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు : ఉదయభాను

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గాంధీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం ముత్యాల గ్రామం కృష్ణా నదిపై గుంటూరు జిల్లా మాదిపాడు వరకు 70 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని, తొందరలోనే టెండర్లు పిలిచి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. అలాగే పట్టణంలో కోటి రూపాయలతో పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేస్తున్నామన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు ఆర్‌అండ్‌బి రహదారులు నిర్మాణం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, తప్పకుండా మరో పది రోజుల్లో రహదారులు మొత్తం నూతన రహదారులుగా నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు



అందిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. అంతకుముందు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పలు సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు స్పందించాలని ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుంటుపల్లి వాసు, కొనుగోలు శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగమణి, ఎంపీడీవో ప్రసాదరావు, తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్

విద్యార్థులు సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని గురుగోవింద్‌సింగ్ ఫౌండేషన్ చైర్మన్ కులదీప్‌కౌర్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కేబీఎన్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కులదీప్‌కౌర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉండే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. అన్ని విద్యా సంస్థల్లోనూ పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమానుబంధాలతో జీవించాలని, కష్టంలో ఉన్న ఎదుటి వ్యక్తికి సాయమందించాలని గురుగోవింద్‌సింగ్ బోధించారన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు గురుగోవింద్‌సింగ్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఏటా లక్షలు తగ్గకుండా స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారని అభినందించారు. ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులకు సుమారు లక్షాపాతిక వేలను అందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి పరంజ్యోత్‌సింగ్, సభ్యురాలు కరంబీర్‌కౌర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కష్ణవేణి, అధ్యాపకులు డాక్టర్ కే కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన శివ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని స్థానిక చెరువు బజారుకు చెందిన తాళ్లూరి శివ సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గురువారం ఉదయభాను స్వగృహంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్‌బాబు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్‌బాబు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తన్నీరు నాగేంద్ర, సాదుపాటి రాజు, దువ్వల రామకృష్ణ, నాయకులు ఎల్ఎన్ సుబ్బారావు, తాళ్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలు : టిడిపి

ప్రజాశక్తి-చల్లపల్లి

వైసీపీ ప్రభుత్వంలో అన్ని తరగతుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పేర్కొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో గురువారం జరిగింది. గ్రామంలోని దుకాణదారులను కలిసి, కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ



మాట్లాడుతున్న మండలి వెంకట్రామ్

సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ జగన్ పాలనలో ఇబ్బందులు పడని వారెవ్వరూ లేరన్నారు. సామాన్య కార్మికులు, రైతాంగం, బడుగు బలహీనవర్గాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల వరకూ అన్ని తరగతుల వారూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతాంగం ధాన్యం విక్రయించుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ధరల పెరుగుదల, ఛార్జీల మోతతో సామాన్యులు తల్లడిల్లుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, తెలుగుమహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కష్ణకుమారి, ఎంపీటీసీలు కనకమేడల వెంకటరత్నం, పైడిపాములు స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గౌరిపర్తి సుబ్బారావు, మోర్ల ప్రసాద్, బోలెం నాగమణి, బి.కనకదుర్గ, జన్ను యానాది, కనకమేడల వాసు, అడుసుమిల్లి నాగమధు, ఘంటా మెహర్, సుబ్బు, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ తదతరులు పాల్గొన్నారు.

'స్పందన' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-గన్నవరం

హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో గన్నవరం మండలం దావాజీగూడెంలోని స్పందన మానసిక వికాస కేంద్రంలో వికలాంగులు చేస్తున్న సేవలు ప్రసంశనీయమని కృష్ణా జిల్లా యువజన శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎన్.నాగేశ్వరరావు అన్నారు.



వెంకట్‌తో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

యూత్ క్లబ్ ఏర్పాటుకు సంబంధించి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రంలో వికలాంగులకు ఉచితంగా విద్య, వైద్యం, రవాణా, భోజన సదుపాయాలతో పాటుగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం చాలా గొప్ప సేవగా అభినందించారు. సమాజానికి నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థ చైర్మన్ వెంకట్, సిబ్బందిని అభినందించారు. గ్రామాల్లో యువత విరివిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ప్రోత్సాహం అందించాలని కోరారు.

సంపటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు బుద్ధప్రసాద్‌ను సత్కరించారు. అర్చకులు చల్లపల్లి కోటేశ్వరరావు ఆశీర్వచనం అందించారు. అనంతరం అన్నదానాన్ని బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భోగరాజు పట్టాభి భవన నిర్మాణంపై నిర్లక్ష్యం

ఎపి బ్రాహ్మణ కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

బందరు అభివృద్ధికి ఎంతో కృషి చేసిన స్వాతంత్ర సమరయోధుడు కీర్తిశేషులు భోగరాజు పట్టాభి సీతారామయ్యపై స్థానిక శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) వివక్ష చూపడం సరైంది కాదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎపి బ్రాహ్మణ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య ఖండించారు. మచిలీపట్నంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ కార్యాలయంపై ఉన్న మమకారం జాతీయ నాయకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య పై పాలకులకు లేకపోవడం బాధాకరమన్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని, రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర వహించి ఆంధ్రబ్యాంకును స్థాపించిన ఒక విజన్ ఉన్న నాయకుడి పట్ల యూనియన్ బ్యాంకు అధికారులు చూపిస్తున్న గౌరవం ఏమిటో, స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని తెలుసుకోలేకపోతున్నారన్నారు. సీతారామయ్య తన స్వగ్రామమైన గుండుగొలనును వదిలిపెట్టి బందరు అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని గుర్తు చేశారు. ఆంధ్రా బ్యాంకు పేరు మారినా ఆ మహనీయుని పేరిట స్థాపించే స్మారక భవనం కోసం యూనియన్ బ్యాంకు వారు రూ.40 కోట్ల పైబడి ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో పి.వి.ఫణి కుమార్, గన్నవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతి సామరస్యంతోనే దేశానికి మనుగడ

గ్లోబల్ ఫీస్ ఫౌండేషన్ అధినేత స్వామి సారంగ్ మోహిలి

ప్రజాశక్తి-గన్నవరం

ఏ దేశం మనుగడ సాధించాలన్నా, శాంతి, సామరస్యాలు కలిగి ఉండటంతో పాటు సర్వమత సమ్మేళనానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్లోబల్ ఫీస్ ఫౌండేషన్ అధినేత స్వామి సారంగ్



మోహిలి పేర్కొన్నారు. మచిలీపట్నం కోనేరు సెంటర్లో హుసైని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే హుసైడే వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి ఆయన గురువారం వచ్చారు. ప్రముఖులు ఎం. అబ్బాస్, అలంధార్ హుస్సేన్ పుష్పగుచ్చాలతో మోహిలికి స్వాగతం పలికారు. దుశాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో మోహిలి మాట్లాడుతూ సర్వమత సమ్మేళనం ప్రాధాన్యతను అందరికీ తెలియజేయడానికి కృషి చేస్తున్నామన్నారు. దేశంలో అనేక కులాలు, మతాలు ఉన్నాయన్నారు. అందరూ అన్నదమ్ముల వలె కలిసి మెలిసి ముందుకు సాగుతున్న పరిస్థితి ఉందన్నారు. దేశంలో కొంత మంది కులాలు, మతాల పేరుతో రెచ్చగొట్టే పరిస్థితులు కొనసాగుతుండటం ఆందోళన కల్గిస్తోందన్నారు. తాము దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 'మంచిని పదిమందికి పంచుదాం.. చెడుని నిర్మూలిద్దాం' అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తే ప్రపంచశాంతి పరిఢవిల్లుతుందన్నారు. ఆయనకు మచిలీపట్టణానికి చెందిన పలువురు ముస్లిం పెద్దలు స్వాగతం పలికారు.

చింతలమడ బాధితులకు పరిహారం అందించాలి : మండలి

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడ దళితులకు ఈనెల 26వ తేదీ నాటికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం చల్లపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాసానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, 18 మంది తీవ్రంగా గాయపడితే నేటికీ సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలమడ దళితుల పక్షాన వారి సమస్యల గురించి మాట్లాడితే రాజకీయం చేస్తున్నామని అంటున్నారన్నారు. ఆపన్నుల పక్షాన నిలబడి వారి తరపున మాట్లాడితే రాజకీయం అంటుండటం సరికాదన్నారు. సీఎం సహాయనిధి ఏర్పాటుచేసిన మౌళిక లక్ష్యాల్లో ప్రమాదాల సమయంలో సహాయం అందించటం ప్రధానమన్నారు. సహజంగానే ప్రభుత్వం నుంచీ సహకారం అందుతుందని భావించిన తనకు 9 నెలలైనా సహాయం రాలేదని దళితులు తమ ఆవేదన వ్యక్తం చేసినప్పుడు ఆశ్చర్యం వేసిందన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందేలా చూడాలన్నారు. మాటల వల్ల ప్రయోజనం లేదనీ, చేతల్లో చేసి చూపినప్పుడే ప్రజలు హర్షిస్తారన్నారు. దళితులకు సహాయం అందించేందుకు ఇంత జాప్యం ఎందుకో తనకు అర్థం కావటంలేదన్నారు. ఈనెల 26 నాటికి ప్రమాదం జరిగి తొమ్మిది నెలలు పూర్తయి 10 నెలలు అవుతుందనీ, అప్పటికల్లా కనీసం సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ధాన్యం రైతుల ఇబ్బందులు

రాష్ట్ర ప్రభుత్వ అనుభవ రాహిత్యం కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండలి బుద్ధప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు నిలుపుదల చేశారనీ, ఇంకా 30శాతం పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 21 రోజుల్లో డబ్బులు చెల్లిస్తామన్న ప్రభుత్వం జనవరిలో విక్రయించిన రైతులకు ఇంకా చెల్లింపులు జరగలేదని రైతులు వాపోతున్నారని చెప్పారు. ఈ క్రాప్ నమోదులో, ఆన్ లైన్, ఆఫ్ లైన్లో రైతాంగం ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, టీడీపీ నేతలు మిక్కిలినేని మధు, రావి చిట్టి, చంద్ర వెంకటేశ్వరరావు, దిరిశం వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న మండలి బుద్ధప్రసాద్

పేద విద్యార్థినికి వంశీ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గన్నవరం

బాపులపాడు మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన అగ్నిపర్తి రాజారావు కుమార్తె అగ్నిపర్తి క్రాంతి విద్య కోసం గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ రూ.50



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వైసిపి నాయకులు

వేలు ఆర్థికసహాయం అందజేశారు. వంశీని నిరుపేద కుటుంబానికి చెందిన క్రాంతి కలిసి తనకు వైద్య విద్య పట్ల అమితమైన ఆసక్తి ఉందనీ, డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలన్నది తన కల అని తెలియజేసింది. నీట్ శిక్షణ కోసం తనకు ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వంశీ తన సొంత నిధుల నుండి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. గన్నవరంలోని నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నాయకులు చందు శివ, గండి కార్తీక్, ఆళ్ళ భాను, కొలుసు ఏసు, చందు రమాదేవి, చందు శ్రీనివాసరావు, రేబాలుడు తదితరులు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వంశీ చేసిన సహాయానికి తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లిలో ఇద్దరు యువకుల మృతి బాధాకరమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. రోడ్డు ప్రమాదంలో చల్లపల్లి లైబ్రరీ రోడ్డుకు చెందిన అద్దంకి గణేష్, రాధా



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నగర్‌కు చెందిన మహమ్మద్ బాబ్ జాన్ లోన్ యాప్ వేధింపులకు విజయవాడలో ఆత్మహత్య చేసుకుని మతి మత చెందిన ఇరువురి కుటుంబాలను గురువారం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని అందించారు. సింహాద్రి రమేష్ బాబుతో పాటు ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, పాగోలు మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ నాయకులు మద్దాల వీరాస్వామి, సీ.హెచ్.సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, మైనారిటీ నాయకులు షేక్ నసీంఘోరీ, అబ్దుల్ కమాల్, జడ్పీ హైస్కూల్ చైర్మన్ సయ్యద్ జహీర్, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు)

రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కూడా కృషిచేయాలని ఎంపీడీవో శేషగిరిరావు కోరారు. ఉంగుటూరు మండలం ముక్కపాడు సచివాలయంలో గ్రామ వాలంటీర్లు, గృహసారథులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముక్కపాడు గ్రామంతోపాటుగా వేమండ,లంకపల్లి గ్రామాల్లో 38 మందిని గృహసారథులుగా ఏర్పాటుచేశామన్నారు. వీరు క్షేత్ర స్థాయిలో తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్న పథకాలు, సమస్యలు వంటి వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి అమీర్ బాష, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ వైసిపి నాయకుడు బి.సీతారామరాజు, గృహ సారథులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నేడు సిపిఎం ధర్నా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం కార్యదర్శి బోయి సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు నష్టం చేస్తూ, కార్పొరేట్లకు మేలు చేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, దీన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 24వ తేదీన వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ వద్దనున్న హెడ్ పోస్టాఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు పిలుపునిచ్చారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పశ్చిమ నియోజకవర్గంలోని 37, 44, 50 డివిజన్లలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కరోనా ప్రభావంతో అల్లాడిన కార్మికులు, ఉద్యోగులకు, రైతులకు, మహిళలకు, యువతకు, సామాన్య ప్రజానీకానికి ఈ బడ్జెట్‌లో మేలు జరుగుతుందని పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయని మండిపడ్డారు. ఎనిమిదేళ్లుగా బిజెపి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేష్టలకు పొంతన లేకుండా మోడీ పాలన సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష పన్నులు రూ.9 లక్షల కోట్లు అయితే, సామాన్య ప్రజానీకం నుండి పరోక్ష పన్నుల రూపంలో రూ.13 లక్షల కోట్లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఉపాధి కల్పన చేసే ప్రాజెక్టులలో పెట్టుబడులను తగినంతగా పెంచాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వేతనాలు పెంచి కేటాయింపులు భారీగా పెంచాలని, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను, పార్లమెంట్‌లో పేర్కొన్న ప్రత్యేక హోదా అంశాన్ని అమలు చేయాలని, ఆహారం, మందులు, ఇతర నిత్యావసర వస్తువులపై జిఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి.సత్యబాబు, నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, జి.సుబ్బారెడ్డి, ఆర్.మోహన్, బి.పుల్లారావు, ఎస్.సుదర్శన్, కాంతారావు, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మా ఆరోగ్యాలు కాపాడండి..!

ఎన్‌టిటిపిఎస్ బూడిదపై ఖిల్లా రోడ్డువాసుల ఆందోళన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ బూడిద వల్ల అనారోగ్యం పాలవుతున్నామని, కనీసం ఇంట్లో అన్నం తినే పరిస్థితి కూడా లేదని స్థానిక ఖిల్లా రోడ్డు వాసులు గురువారం ఆందోళనకు దిగారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ బూడిద రవాణా చేస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఆందోళనకు సిపిఎం మండల కార్యదర్శి ఎం.మహేష్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విటిపిఎస్ బూడిద రవాణాను మాఫియాగా మార్చి కోట్లు ఆర్జిస్తున్నారని, స్థానికులకు కనీసం వసతులు కూడా కల్పించడంలేదని అన్నారు. చెరువు నుండి బూడిద రవాణా చేసే రోడ్డు మార్గాన్ని జనావాసాల నుండి మార్చాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ధూళి లేకుండా నీళ్లు చల్లాలని, బూడిదను శుభ్రం చేయాలని కోరారు.



మినీ పార్కు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్థానిక బస్టాండ్‌లో దాతల సహాయంతో నిర్మిస్తున్న మినీ పార్కు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా గ్రీనరీ, లైటింగ్, ఫౌంటెన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. జగ్గయ్యపేట పట్టణానికి 25 సంవత్సరాలు సర్పంచిగా విధులు నిర్వహించి జగ్గయ్యపేటకు మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించిన సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహాన్ని మరికొన్ని రోజుల్లో ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌రావు, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైసిపి నాయకులు కాశీకిషోర్, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ రైతుల గోడు పట్టేనా?

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో సుబాబుల్ రైతుల గోడును ఎవరూ పట్టించుకోవటం లేదు. సమస్యలను ప్రస్తావిస్తే అధికార వైసిపి నాయకులు చర్చను పక్కదారి పట్టిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే సుబాబుల్ టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర దక్కేలా చూస్తామని హామీనిచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల గడిచినా సుబాబుల్ టన్నుకు రూ.2,400కు మించి రావడం లేదు. మార్కెటింగ్ శాఖ బాధ్యత నుండి వైదొలగింది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగవుతోంది. పేపరు కంపెనీ నిర్వాహకులు, ట్రేడర్లు, దళారులు సిండికేటుగా మారి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్రస్థాయిలో సుబాబుల్, జామాయిల్ రైతుల సమస్యలపైసమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



రైతుమిత్ర పూల మార్కెట్లో దళారులదే హవా

విజయవాడ హోల్‌సేల్ పూల మార్కెట్ వర్తక సంఘం



ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ క్లబ్ కరకట్ట వద్ద ఏర్పాటు చేసిన రైతు మిత్ర పూల మార్కెట్‌లో అసలైన రైతులు, వ్యాపారస్తులు ఎవరూ లేరని, దళారులతో సాగుతోందని విజయవాడ హోల్‌సేల్ పూల మార్కెట్ వర్తక సంఘం నాయకులు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రెసిడెంట్ జి.అశోక్‌కుమార్, సెక్రటరీ డి.విఠల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ రఫీ, జాయింట్ సెక్రటరీ ఎ.ప్రకాష్ మాట్లాడుతూ విజయవాడ క్లబ్ సమీపంలో కృష్ణా నది కరకట్ట వద్ద కొందరు దళారులు ఏర్పాటు చేసిన రైతు మిత్ర పూల మార్కెట్ అనధికార నిర్మాణమని ఆరోపించారు. విజయవాడలో పూల వ్యాపారం దెబ్బతీయాలనే దురుద్దేశంతో తాము రైతుల వద్ద 20 శాతం కమీషన్ తీసుకుంటున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల వద్ద నుంచి 5 నుంచి 10 శాతం మాత్రమే కమీషన్ తీసుకుంటున్నామన్నారు. కరకట్ట వద్ద 64 సెంట్ల భూమిలో 82 షాపులు అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, దీనిపై అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. అక్కడ రైతులమని చెప్పుకొనే వారంతా తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన వారేనన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి పి.శివదుర్గాప్రకాష్, పలువురు పూల రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2.90 లక్షలు విరాళం

ప్రజాశక్తి-భవానీపురం: దుర్గగుడి నిత్యాన్నదానం పథకానికి హైదరాబాద్‌కు ఎస్ఆర్‌నగర్‌కు చెందిన కె.సావిత్రి కుటుంబ సభ్యులు రూ.2.90 లక్షలు ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబుని గురువారం ఆలయంలో కలిసి దేవస్థానానికి డిడి రూపంలో విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బుద్దా రాంబాబు, నంబూరి రవి ఉన్నారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు మాజీ మంత్రి, టిడిపి నాయకులు యనమల రామకృష్ణుడు ఆలయానికి వచ్చారు. ఆయనకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం చేయించి, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పాల్గొన్నారు.




లోకేష్ ప్రగల్భాలు మానుకోవాలి : మొహిద్దీన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి అధికారంలోకి వస్తే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామంటూ మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామంటూ టీడీపీ నాయకుడు లోకేష్ ప్రగల్భాలు పలకడం మానుకోవాలని వైసిపి మైనారిటీ రాష్ట్ర నాయకుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపలో తన మేనమామను సైతం కాదని అంజాద్ బాషాకి సీటు ఇచ్చి, గెలిపించడమే కాకుండా డిప్యూటీ సీఎంను చేసిన చరిత్ర జగన్‌కు ఉందన్నారు. టిడిపి హయాంలో ఎంత మంది మైనారిటీలకు రాజకీయంగా మేలు జరిగిందో చెప్పాలన్నారు. ఎంత మందికి ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చారో బహిరంగ చర్చకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ కరీం, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.




ఎర్రన్నాయుడు జయంతి

ప్రజాశక్తి-విజయవాడరూరల్: ఢిల్లీలో తెలుగువాడి గొంతును బలంగా వినిపించిన నేత, ఎంపీగా, కేంద్రమంత్రిగా తెలుగువారికి వన్నె తెచ్చిన నాయకుడు కింజారపు ఎర్రన్నాయుడు అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం గొల్లపూడిలో ఎర్రన్నాయుడు 66వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ప్రతి పదవికి వన్నెతెచ్చిన తెలుగుతేజమని, ప్రజాసేవే పరమావధిగా, ప్రజాసంక్షేమం ఊపిరిగా జనహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ ఎర్రన్నాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సాదనాల ప్రసాద్, నర్రా వాసు, జాలిపర్తి గోపాలకృష్ణ, ధారావత్ శ్రీనునాయక్, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



గణిత ప్రయోజన వేదిక-4 ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం గ్రామంలో నివాస గృహాల గోడలపై పాఠశాల గణిత విభాగం ఆధ్వర్యంలో గణిత ప్రయోజన వేదికను మండల విద్యాశాఖాధికారి రవీంద్ర నాయక్ ఆవిష్కరించారు. గత మూడేళ్లుగా గణిత విస్తృతిలో భాగంగా ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా గణితోపాధ్యాయులు గోవిందన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యా శ్రీనివాస్‌రావులను అభినందించారు. గ్రామ కూడలిలో ఉన్న గోడలపై గణిత అంశాలను రాయడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధారావతు హరిబాబు, రామచంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయులు కే.వి.రాఘవయ్య, అక్కి ఉషారాణి, చల్లా శ్రీదేవి, విజయలక్ష్మి, నాగేశ్వరరావు, వెంకట్రామ్ పాల్గొన్నారు.





మాదిగల సంగ్రామ పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తెలంగాణ, ఆంధ్ర జిల్లా సరిహద్దు మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని మాదిగవాడ నుండి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ చేపట్టిన రెండో విడత పాదయాత్రను గురువారం మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) ఉమ్మడి కృష్ణాజిల్లా ఇంచార్జ్ మంద వెంకటేశ్వరరావు మాదిగ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాదిగలను మోసం చేస్తున్నారన్నారు. దీనిపై మార్చి 5న రాజధానిని ముట్టడిస్తామని హెచ్చరించారు. పాదయాత్ర ద్వారా జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో ప్రతి గ్రామంలో పర్యటించి మాదిగలను చైతన్యవంతం చేస్తామన్నారు. పాదయాత్రకు టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల సురేష్ సంఘీభావం తెలపగా యంగ్రాతి కోటేశ్వరావు, ఆదూరి నాగమల్లేశ్వరరావు, కోట డానియల్, మంద పిచ్చయ్య, మోదుగు శ్రీనివాస్, మాతంగి దావీదు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.18 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ దేవస్థానానికి బహిరంగ వేలం పాటల ద్వారా రూ.18.12 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి కె.లీలాకుమార్ తెలిపారు. గురువారం జరిగిన వేలం పాటలో ఆలయ సమీపంలో క్యాంటీన్ నిర్వహించుకునేందుకు గ్రామానికి చెందిన పచ్చల శివప్రసాద్ రూ.6.01 లక్షలు, ఆలయ ప్రాంగణంలో ఫొటోలు తీసుకొను హక్కును గ్రామానికి చెందిన కొత్తపల్లి సతీష్ రూ.12.11 లక్షలకు పాడుకున్నారు. మిగిలిన పాటలకు పాటదారులు ఎవరు ముందుకు రాకపోవడంతో వాయిదా వేయడం జరిగిందని చైర్మన్ చెన్న కేశవరావు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కంచికచర్ల: రాష్ట్రంలో 75 సంవత్సరాల తర్వాత బిసి వడ్డెర జాతికి న్యాయం జరిగిందని వడ్డెర సంఘం నాయకులు, వడ్డె ఓబన్న సేవ సంఘం నాయకులు అన్నారు. వైసిపి బిసి వడ్డెర కుల సామాజిక వర్గానికి చెందిన నాయకులు చంద్రగిరి యేసురత్నం శాసనమండలి సభ్యులుగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల గోపి, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, బత్తుల వెంకట కోటయ్య, కుంచం నరసింహారావు, అచ్చి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగించాలి

ప్రజాశక్తి-నందిగామ: ఖాళీ స్థలాలలో మురుగు నీరు తొలగించాలని నందిగామ నగర పంచాయతీ కమిషనర్ జయరాం పేర్కొన్నారు. 19వ వార్డు అనాసాగరం డివిఆర్ కాలనీ లో గురువారం ఆయన పర్యటించారు. ప్రతి వీధి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాలో ఉన్న మురుగునీరు ప్రదేశాలను పరిశీలించి ఆయిల్ బాల్స్, దోమల మందు పిచ్చికారి చేయించాలని సిబ్బందికి సూచించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

పామర్రు ఎంఎల్ఎ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న నవరత్న పథకాల ద్వారా అన్ని తరగతుల ప్రజలకు ఆర్థిక భరోసా అందుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులోని శ్రీనివాస కళ్యాణ మండపంలో గృహసారథలకు ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తమకు కేటాయించిన కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం ద్వారా అందాల్సిన పథకాలు పారదర్శకంగా అందేలా గృహ సారథులు కృషిచేయాలని



మాట్లాడుతున్న పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్

కోరారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి వాలంటీర్లు, అధికారుల ద్వారా కృషిచేయాలని సూచించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతున్నాయన్నారు. మిగిలిన లబ్ధిదారులు ఉంటే వారు కూడా గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తిచేసేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వారు పొందిన పథకాలతో కూడిన వివరాలతో తయారుచేసిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పమిడిముక్కల మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, ఎంపిపి కాసాని వేద సుప్రజ, శ్రీరంగాపురం సర్పంచ్ పద్మావతి, శౌరి వెంకటేశ్వరరావు, కొడమంచిలి మహేష్, జంధ్యాల సీతారామయ్య, కోఆప్షన్ సభ్యులు మీర్జాదినాయత్ ఆలీ, ఐనపూరు గ్రామ సర్పంచ్ కొండ జయలక్ష్మి, వేణు, వెంకటేశ్వరరావు గురువిందపల్లి వంశీ, శ్రీదేవి, మైనేని కోటేశ్వరరావు, కంబపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌లో విద్యుత్‌లైన్లు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలోని జగనన్న లేఅవుట్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్‌ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కరెంటు మీటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, విద్యుత్ శాఖ డిఇ, ఎడి, ఇఎఇలు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



కలెక్టర్ పి.రంజిత్‌భాషను అభినందిస్తూ విసిలో మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో మీ కృషి భేష్

కలెక్టర్ రంజిత్ బాషాకు సిఎస్ జవహర్‌రెడ్డి ప్రశంసలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజి) సాధనకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాష విజన్ అభినందనీయమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాష మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు. కలెక్టర్ ఇచ్చిన ప్రజెంటేషన్‌పై సీఎస్ స్పందిస్తూ జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే రీతిని చక్కగా వివరించారని కలెక్టర్‌ను అభినందించారు. ఎస్డీజీ లక్ష్యాల సాధనకు వ్యక్తిగత శ్రద్ధ కూడా అవసరమని గుర్తుచేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లా కలెక్టర్లు సైతం దీనిని ఆదర్శంగా తీసుకొని అనుసరించడానికి ప్రయత్నించాలని ఆయన సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై కలెక్టర్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ జిల్లాను ఎనిమియా రహితంగా మార్చేందుకు వైద్య, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ పోర్టల్స్ ద్వారా డేటాను సేకరిస్తున్నప్పటికీ, గణాంకాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయన్నారు. ఇది ఆయా శాఖలు వివిధ పోర్టల్లను ఉపయోగించడం, ఒక శాఖ డేటా మరొక శాఖకు యాక్సెస్ లేకపోవడం వల్లనే జరుగుతోందని వివరించారు. దీనిని అధిగమించడానికి ఉమ్మడి పోర్టల్ ఏర్పాటు చేయడం ద్వారా వివిధ శాఖల సిబ్బంది సేకరిస్తున్న డేటాను అందరూ పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సమీర్ శర్మ ఆదేశాల మేరకు 18 నుంచి 19 వయస్సు గల కిశోర బాలికలు, 15 నుంచి 49 వయస్సులోని గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించడానికి ఐరన్ ట్యాబ్లెట్స్‌ను అందించడంతో పాటు వారికి అందించే ఆహారంలో బీట్రూట్, క్యారెట్లను చేర్చే విధంగా జిల్లాలోని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా వరి కుప్పల మీదనే ఉందని తెలుపగా, సానుకూలంగా స్పందించిన సీఎస్ అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జి.గీతాబాయి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.శేఖర్, డిఆర్డిఎ పీడీ ప్రసాద్, డీఎల్ఓ సుబ్బారావు, ఐసిడిఎస్ పీడీ సువర్ణ, డిపిఒ నాగేశ్వరనాయక్, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫణి దూర్జటి, సోషల్ వెల్ఫేర్ డిడి కె.సరస్వతి, మచిలీపట్నం నగర కమిషనర్ చంద్రయ్య తదితరులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



అవనిగడ్డ మండలం పులిగడ్డలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్‌మీటర్లు అందజేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి : సింహాద్రి

ప్రజాశక్తి-కోడూరు

రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి లేకుండా అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. గురువారం కోడూరు



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మండలంలోని జరుగువానిపాలెం గ్రామ రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. త్రాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు జెడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కొండవీటి వెంకటనారాయణరావు, వెన్నా ప్రసాద్, జొన్నా సీతారామయ్య, అప్పికట్ల ప్రసాద్, అప్పికట్ల చలపతిరావు, జనసేన పార్టీ నాయకులు యర్రంశెట్టి దామోదర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేలో ఉయ్యూరు విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-ఉయ్యూరు

విద్యతోపాటు ఆటలు, కరాటే వంటి అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కంకిపాడు సిఐ ఎస్.పరమేశ్వర్ అన్నారు. వేమవరం శరచంద్ర ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఇటీవల జరిగిన



అఖిల భారత కరాటే చాంఫియన్‌షిప్-2023 పోటీల్లో ఉయ్యూరు ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈసందర్భంగా స్కూల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ పరమేశ్వర్, పట్టణ ఎస్సై ఎన్.వీరప్రసాద్ పాల్గొని విజేతలకు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు, స్వీయ రక్షణకు కరాటే వంటివి నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరమన్నారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ఆట పాటల్లో రాణించాలని సూచించారు. యశస్విని, బి.వర్షితారెడ్డి, టి.సుజిత్ గౌతమ్, శాయికమల్ ప్రథమ బహుమతి సాధించగా, కె. తరుణ్, పి.సందీప్, షరీఫ్ ఉన్నీసా ద్వితీయ బహుమతి, కె.గిరీష్, పి.పవన్, ఎండి రజాక్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. క్రీడాకారులను స్కూల్ డైరెక్టర్ ఎం.బాబు, అతిథులు అభినందించారు.

ఇళ్ల నిర్మాణంలో సర్పంచ్ కృషి అభినందనీయం : దేవరపల్లి

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఇతర పేదవర్గాలకు ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంలో కొత్త మాజేరు సర్పంచ్ కళ్ళేపల్లి లక్ష్మి, ఆమె భర్త లక్ష్మీనారాయణల కృషి, చొరవ అభినందనీయమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు తెలిపారు. చల్లపల్లి మండలం కొత్త మాజేరులో ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్నకాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 60 పైగా గృహ నిర్మాణాలకు ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు ఆలస్యం అవుతున్నా ఇళ్ళ నిర్మాణ పనులు ఆగకుండా తన సొంత పెట్టుబడి, ఖర్చులతో సర్పంచ్ లక్ష్మి ఒకేసారి అన్ని గృహాలను శరవేగంగా పూర్తిచేయటానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలనీలకు పంచాయితీ ద్వారా రావాల్సిన అన్ని వసతులను వేగంగా కల్పిస్తున్నారన్నారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా గృహలబ్ధిదారులపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందిస్తున్న నగదు, నిర్మాణ సామాగ్రిల పరిణామం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులు ఆలస్యం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పేద వర్గాల ప్రజలకు ఒకేసారి దాదాపు 15 లక్షల పైగా గృహ నిర్మాణాలు చేపట్టి వారికి సొంత ఇల్లను సమకూర్చాలనే ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తమ్ము మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న దేవరపల్లి సురేష్‌బాబు

ముడా వీసీగా రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) వైస్ చైర్ పర్సన్‌గా కె.రాజ్యలక్ష్మి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషను కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న రాజ్యలక్ష్మి

బాక్సింగ్ ఛాంప్ విక్రమ్‌కు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో ఛాంపియన్ విక్రమ్ నాయుడును ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అభినందించారు. యూనివర్సల్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ సూపర్ ఫెదర్ వెయిట్ అంతర్జాతీయ ప్రొఫెషనల్ ఫైట్ అంతర్జాతీయ బాక్సింగ్ విజేత విక్రమ్‌నాయుడు గురువారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డిల్లీరావును కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రాధమికంగా శిక్షణ పొంది హైదరాబాదులో నుండి షాడో కిక్ బాక్సింగ్ సెంటర్లో కెరీర్‌ను మెరుగుపరుచుకుని రాష్ట్ర, అంతర్జాతీయ క్రీడాకారుడుగా గుర్తింపు పొందడం అభినంద నీయమన్నారు. ప్రతిభగల క్రీడాకారులకు జిల్లా యంత్రాంగం తోడ్పటునందిస్తుందని అన్నారు.



విక్రమ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

పేదల సంక్షేమమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంచి చేయాలనే ముఖ్యమంత్రి ఆలోచనకు ప్రస్తుతం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలే నిదర్శనమన్నారు. మంత్రులు బొత్స, అంబటి, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, శాసనసభ్యులు మల్లాదివిష్ణు మట్లాడుతూ విజయవాడలో ఎన్నో ఏళ్ళగా నివాసిస్తున్న పేదలకు కేవలం రూ.100 రుసుముతో 3,500 గృహాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని, బసవతారకనగర్, సుబ్బరాజనగర్, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మరో 500 మందికి త్వరలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. సిఎం చేతుల మీదుగా మార్చిలో 27 వేల మందికి లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, జెసి ఎస్ నుపూర్ అజయ్ పాల్గొన్నారు.

విజయవాడలో కిడ్నాప్...

(మొదటి పేజీ తరువాయి)

నాగరాజు కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వాహనదారులు గమనించి మార్టూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్సకోసం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. తనతో సహజీవనం చేసిన సంతోష్ కుమారి తనపై కిరాయి గుండాలతో దాడి చేయించిందని నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్టూరు ఎస్‌ఐ కోడూరు కమలాకర్ తెలిపారు.

'లారస్ లాబ్స్'కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ : కంచికచర్ల మండలం మెగులూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో అత్యధునిక మౌలిక వసతులను కల్పించి మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన లారస్ లాబ్స్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చావ నరసింహారావు, 'కనెక్ట్ టు ఆంధ్రా' సిఇవో కోట్ల శివశంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్ గురువారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావును ఆయన కార్యాలయంలో కలిశారు. **ఈ సందర్భంగా** కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధునిక మౌలిక వసతుల కల్పనకు 'కనెక్ట్ టు ఆంధ్రా' ద్వారా లారస్ లాబ్స్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు.



హస్తకళా ప్రదర్శనను తిలకిస్తున్న జెసి నుపూర్ అజయ్

హస్త కళాకారులను ప్రోత్సహించండి : జెసి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హస్త కళలను ఆదరించి ఆ కళాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ కోరారు. ఆంధ్రప్రదేశ్ హస్త కళాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పిన్నమనేని పాలి క్లీనిక్‌రోడ్డులో గల సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హస్త కళాల ప్రదర్శన లేపాక్షి క్రాఫ్ట్ బజార్ -2023ను గురువారం ఆమె సందర్శించారు. అనంతరం జెసి మట్లాడుతూ ప్రాచీన హస్త కళలు మన సాంస్కృతీ సాంప్రదాయలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఇడి ఎం.విశ్వ, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బి.విజయలక్ష్మి, వీవర్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ అపర్ణ లక్ష్మి పాల్గొన్నారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి ప్రవీణ్ రాక

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఈనెల 24న మధ్యాహ్నం 3 నుండి 6 గంటల వరకు నగరంలో జరిగే బూత్ స్వశక్తి కరణ్ అభియాన్లో ల్గొంటారు.

విఠల్ దంపతులకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - మొవ్వ

ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును పసుమర్తి భారతీ విఠల్ దంపతులు రాష్ట్రపతి ద్రౌపతీముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతీముర్ము చేతుల మీదుగా పసుమర్తి భారతీ విఠల్ దంపతులు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నట్లు



కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు సొంతం చేసుకున్న పసుమర్తి భారతీ విఠల్ దంపతులను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ చింతా రవి బాలకృష్ణ ,బాలా త్రిపుర సుందరి గ్రంథాలయ పాలకులు వై.వి ఫణికుమార్,కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ,కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయ్య శర్మ, పసుమర్తి శ్రీనివాస్, కళాక్షేత్రం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పలువురు కళాకారులు, స్థానికులు అభినందించిన వారిలో ఉన్నారు.

పాతఎడ్లలంకలో దుండగుల ఆగడాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని పాతఎడ్ల లంక గ్రామంలో ఇటీవల కాలంలో పలు రకాల వస్తువులను దొంగతనంగా



వలలను తగులబెట్టిన ప్రదేశం ఇదే..

తగులబెట్టబడుతున్నాయి. బాధితులు ఈ విషయాలను పోలీసు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముద్దాయిలు ఎవరో తెలిసినా రాజకీయ నాయకుల సంప్రదింపులతో కేసులు మాఫీ చేయడంతో మరోసారి అదే తరహా దాడులు జరిగాయి. గత మూడు రోజుల క్రితం గ్రామంలో బాధితులు వారి వస్తువులు తగలబెట్టిన వారి పేర్లు కూడా ఫిర్యాదు రూపంలో అందజేశారు. మరోసారి రాజకీయ నేతలు జోక్యం చేసుకుని అగ్గి దాడులు మాఫీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఏడాదిన్నర క్రితం పుష్కర ఘాటు వద్ద మైల వీర్రాజు చేపల వేట చేసే వలలు గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. ఇటీవల వరదల సమయంలో రేవు పడవ నడిపే పాలెపు నాంచారయ్య అనే వ్యక్తి మోటార్ సైకిల్‌ను పెట్రోల్ పోసి తగులు పెట్టారు. మరోసారి బందీల చందుకు చెందిన రూ.1.50 లక్షలు ఖరీదు చేసే చేపల వేట వలలను తగులబెట్టారు. ఈ విషయంలో ముద్దాయిలుగా పేర్కొనబడిన వారు గ్రామంలోని ఎంపిటిసి కుటుంబ సభ్యులు కావడం కొసమెరుపుగా వినపడుతోంది. ఏదేమైనా పాత యడ్లంక గ్రామంలో వరసగా జరుగుతున్న ఈ అగ్గి దాడులు ఎంతమందికి నష్టం చేకూరుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. అందువల్ల పోలీసులు జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా దోషులను శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

ప్రజాశక్తి - మొవ్వ

పేదలను మరింత పేదరికంలోకి నెట్టి సంపన్న వర్గాలను మరింత ధనవంతులుగా మార్చేదిగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మొవ్వ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నిడుమోలులో అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.రఘు మాట్లాడుతూ దేశంలో 80 శాతం ఉన్న పేదలను గాలికొదిలేసి సంపన్న వర్గాలకు రాయితీలు ఇచ్చిన కేంద్రబడ్జెట్ ఎవరి ప్రయోజనాల కోసమో గమనించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించిన కేంద్రం అదే సమయంలో అదానీ,అంబానీలకు రూ.4.50 లక్షల కోట్ల రాయితీలు ఇవ్వడం కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల ప్రయోజనాలను దెబ్బతీయటమేనన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు ఊసే లేదన్నారు. వ్యవసాయ, ఉపాధి పనులకు నిధుల పెంపు జరగలేదన్నారు. విభజన హామీల అమలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని,రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అదానీ అవినీతిపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా అధికార, ప్రతిపక్ష పార్టీలు కనీసం గొంతెత్తకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో



మాట్లాడుతున్న ఆర్.రఘు

వ్యవసాయ రంగానికి ఆశించిన కేటాయింపులు లేవన్నారు. సిపిఎం నాయకులు శీలం నారాయణరావు, వై.మధు, మద్దుల బసవారావు,ఐద్వా నాయకురాలు చేబ్రోలు బసవపూర్ణమ్మ,వడ్డికాసులు,రావూరి రమేష్, కె.రాంబాబు, వాసు, నల్లబ్బాయి,జె.భాస్కరరావు, వి.వెంకటేశ్వరరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మార్చి 30 కల్లా జిల్లాలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసి రీసర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి భూపరిపాలన ప్రధాన కమీషనర్ (సీసీఎల్ఎ) జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో తన బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే పురోగతిని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి కేటగిరీలో 17 గ్రామాలు, రెండో కేటగిరీలో 63 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మూడో కేటగిరీలో 61 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. వీటిలో 53 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన 8 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తికావాల్సివుందన్నారు. మార్చి 30 కల్లా మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి, రెండు కేటగిరీలలో రీసర్వే పూర్తయిన 100 గ్రామాలలో 63,757 రాళ్లు (స్టోన్స్) జిల్లాకు చేరాయని, వాటిలో 8,367 స్టోన్స్ ప్లాంటేషన్ పూర్తయ్యాయని, మిగిలిన 55,390 స్టోన్స్ ప్లాంటేషన్ జరగాల్సి ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో మిగిలిన వాటికి స్టోన్స్ ప్లాంటేషన్ పూర్తికావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, సర్వే ఏడీ గోపాల్ రాజా, కలెక్టరేట్ తహసీల్దార్ ఎం.హరనాద్ కలెక్టర్ తోపాటు వీడియోకాన్ఫరెన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

జటావత్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి-ఘంటసాల

సిపిఎం సీనియర్ నాయకులు, తెలుగురావుపాలెం మాజీ సర్పంచ్ జటావత్ రెడ్డి 23వ వర్ధంతి గ్రామంలోని ఆయన స్మారక స్థూపం వద్ద గురువారం జరిగింది. నిడుమోలు మాజీ శాసనసభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు పాటూరు రామయ్య తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాటూరు రామయ్య మాట్లాడుతూ



నివాళులర్పిస్తున్న పాటూరు రామయ్య తదితరులు

జటావత్ రెడ్డితో తనకు నిడుమోలు శాసనసభ్యులు కాకముందు నుంచి పరిచయం ఉందన్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయమన్నారు. జటావత్తు రెడ్డి కుమారులు జటావత్ బాలాజీ, జటావత్తు హాతి రాముడు, సిపిఎం నాయకులు వాకా రామచంద్రరావు, మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, తెలుగురావు పాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), ఎన్.బిక్షం రాజు, జి.గిరిరాజు, జి.సీతారామయ్య, ఎం.విక్రమ్‌రావు, ఆర్.సాంబశివరావు, జె.శివశంకరరావు, జి.గురు ప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం : టిడిపి

అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడుతోందని విమర్శించారు. వైసిపిని ఓడించి తెలుగుదేశం పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మండల టిడిపి అధ్యక్షులు యాసం చిట్టిబాబు, పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బండే కనకదుర్గ, విశ్వనాథపల్లి పాప, మేఘావత్ గోపి, తాడేపల్లి రంగనాథ్, మైల హరిబాబు, కనగాల సత్యంబాబు, జటోత్ శ్రీను, యాసం లంకమ్మ, గొడుగు రవి, కోట సాయి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి కార్యాలయంపై వైసిపి దాడి నేపథ్యంలో డిజిపి కార్యాలయం ముట్టడి నేపథ్యంలో కృష్ణాజిల్లాలోని పలుచోట్ల ఆ పార్టీ నాయకులు గృహనిర్బంధంలో ఉంచారు. నిరసనలకు అనుమతులు లేవని చెబుతూ బయటకు రానీయకుండా చేశారు.

నిర్బంధం దారుణం : కొల్లు, కొనకళ్ళ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల నిర్బంధాలు, అక్రమ కేసులు బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాలకు వేధింపులు, మహిళలపై ఆకృత్యాలకు రాష్ట్రం వేదికగా మారిందని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు విమర్శించారు. డిజిపి కార్యాలయం ముట్టడి పిలుపు ఊహాగానాల నేపథ్యంలో కొనకళ్ళ నారాయణ రావు, కొల్లు రవీంద్ర లను ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధ్వంసం సృష్టించిన వారి పైన కేసులు పెట్టడం చేతకాక టిడిపి వారిపై పెట్టడం పోలీసుల పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు.

గన్నవరం(హనుమాన్ జంక్షన్) : టిడిపి రాష్ట్ర నాయకులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావును బాపులపాడు మండలంలోని రంగన్నగూడెం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద వీరవల్లి పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేశారు. దీనికి నిరసనగా ఆయన తన గృహంలోనే స్థానిక టిడిపి నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ,ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు,గ్రామ టిడిపి నాయకులు కసుకుర్తి అర్జునరావు, కనకవల్లి యాకోబు, కొలుసు గంగరాజు, లావు సుబ్బారావు, నెరసు తాతయ్య, కాట్రు పాపారావు, కనకవల్లి శేషగిరిరావు, నత్తా అబ్రహం, కనకవల్లి యేసయ్య, మందపాటి రాంబాబు పాల్గొన్నారు. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన తనను పోలీసులు అరెస్టులు చేయడం దుర్మార్గమని ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ ఆనంద సూర్య తీవ్రంగా ఖండించారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలను అరెస్ట్‌చేసి చిలకలపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అవనిగడ్డ : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. టిడిపి నాయకులు పార్టీ కార్యాలయం నుండి అవనిగడ్డ ప్రధాన సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావు, జాస్తి సరళ, తలసిల స్వర్ణలత, బండే కనకదుర్గ, విశ్వనాథపల్లి పాప, బండే రాఘవ, వై.లంకమ్మ, బర్మా శ్రీనివాసరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, కొండవీటి పాండురంగారావు, రేపల్లె ప్రతాప్, యలవర్తి చిన్న, మైల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బాపులపాడు మండలం రంగన్నగూడెంలో నిరసన



బందరులో గృహనిర్బంధంలో ఉన్న కొనకళ్ల నారాయణరావు

ఎర్రన్నాయుడుకు నివాళి

ఉయ్యూరు : టీడీపీ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ కేంద్రమంత్రి కింజారపు ఎర్రన్నాయుడు సేవలు చిరస్మరణీయమని పలువురు కీర్తించారు. సర్దార్ గౌతులచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో గురువారం ఎర్రన్నాయుడు జయంతిని నిర్వహించారు. ఎర్రన్నాయుడు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, నజీర్, వీరంకి శివాజీ, రెడ్డి రమణ పాల్గొని నివాళులర్పించారు.



ఎర్రన్నాయుడికి నివాళులర్పిస్తున్న ఎం.ఎస్ బేగ్ తదితరులు

ఎర్రన్నాయుడు సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-వన్‌టౌన్: బడుగు బలహీన వర్గాల ప్రజలకు టిడిపి నాయకులు కింజరపు ఎర్రన్నాయుడు సేవలు స్ఫూర్తిదాయకమని టిడిపి రాష్ట్ర నాయకులు ఎంఎస్.బేగ్ కొనియాడారు. గురువారం ఎర్రన్నాయుడు జయంతి కార్యక్రమం టిడిపి పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ టిడిపి అభివద్ధి కోసం చివరి వరకు ఎర్రన్నాయుడు కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, పశ్చిమ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్, కార్యదర్శి బూర కనకారావు, పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ హబీబ్, కార్యదర్శి సయ్యద్ ఇమ్రాన, తదితరులు పాల్గొన్నారు. బుద్దా వెంకన్న కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉమ్మడి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల రవీంద్ర, సోమి వెంకటేశ్వర్లు, ఈగల సాంబ, తుపాకుల వెంకటేశ్వరరావు, ముద్దాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.11 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి మహామండపం ఆరో అంతస్తులో దుర్గగుడి హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. 14 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు రూ.2,11,36,722, బంగారం 558 గ్రాములు, వెండి 4.6 కిలోలు, ఈ- హుండీ ద్వారా రూ.22,989 యాత్రికులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి దర్బముళ్ల భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు బుద్దా రాంబాబు, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-భవానీపురం: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కెవి విద్యాధరపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా 24వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు లేబర్ కాలనీ, ఆర్‌టిసి డిపో, భారత్ గ్యాస్ రోడ్, అప్పలస్వామి క్వారీ, కెసి పబ్లిక్ స్కూల్ రోడ్, అరవింద వీధి, సిమెంట్ రోడ్, లొల్లా వారి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమ్యూనిటీ హాళ్లు పేదలకు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: కార్పొరేషన్ కమ్యూనిటీ హాళ్ల, షాదీఖానా, కల్యాణ మండపాలు పేదలకు అందుబాటులో ఉంచాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వన్‌టౌన్‌లోని లెనిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల వారు శుభ కార్యక్రమాలు,



ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిస్టుల పాలనలో నగరంలో అనేక ప్రాంతాలలో కమ్యూనిటీ హాల్స్, షాదీ ఖానా, కళ్యాణ మండపాలు నిర్మించడం జరిగిందన్నారు. నేటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజల ప్రయోజనాలు దష్టిలో ఉంచుకొని సచివాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించి కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, మూలి సాంబశివరావు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులేవీ?

విజయవాడ రూరల్ మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: ధాన్యం డబ్బులు సకాలంలో అందక రైతులు అవస్థలు పడుతున్నారని అధికారులపై సభ్యులు ధ్వజమేత్తారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం గురువారం ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగింది. మండల వ్యాప్తంగా రూ.10 కోట్లు మేర ధాన్యం డబ్బులు రావాల్సిన పరిస్థితి ఉందని ప్రసాదంపాడు పిఎసిఎస్. చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సకాలంలో డబ్బులు రాక రబీ సాగుకు రైతులు మరింతగా అప్పులు చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు సివిల్ సప్లై శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమావేశంలో వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ధాన్యం ఆన్లైన్ చేయడం లేదని, దానివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆన్లైన్ చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. రైతులు తీసుకున్న రుణానికి వడ్డీ రాయితీ రావడంలేదని ఎంపిటిసి పత్తిపాటి రవీంద్ర (నాని) అన్నారు. వెంటనే రైతులకు వడ్డీ రాయితీని చెల్లించాలని కోరారు. పలు అంశాలపై వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, జడ్‌పిటిసి సువర్ణ రాజు, తహసీల్దార్ జాహ్నవి, ఎంపిడిఒ భార్గవి, ఎఒ రంగనాథ్‌బాబు, ఇఒఆర్‌డి శేషగిరిరావు తదితరులు మాట్లాడారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నేడు లయోలాలో సైంటియా టెక్నోమీట్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆంధ్రా లయోలా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి టెక్నోమీట్ - 2023



నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ నందు టెక్నోమీట్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే ఉద్దేశంతో తమ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం సైంటియా పేరుతో టెక్నోమీట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్, క్విజ్, టాప్‌కోడి, సెర్చ్‌మీ, పోస్ట్‌మైవాల్, స్పాట్ ఫోటోగ్రఫీ, ఐయామ్ బిల్‌గేట్స్, మిస్టర్ అండ్ మిసెస్ సైంటియా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 50 కళాశాలల నుండి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి నెహ్రూ, కో ఆర్డినేటర్ కె.అపర్ణ, పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రోలర్ స్కేటింగ్‌లో జోయల్ రోలర్ స్కేటింగ్ క్లబ్ క్రీడాకారులు పతకాలు సాధించారని క్లబ్ సభ్యులు మహంతి వాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో జరిగిన పోటీలలో అండర్-19 విభాగంలో వై.మాధురి రెండు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో కె.పూజ రెండు రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను క్లబ్ సభ్యులు ఆర్.ఎస్.ఎన్.ప్రసాద్ కంతేటి నవీన్, పతివాడ ప్రసాద్ అభినందించారు.



నానో టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: నానో టెక్నాలజీలో పట్టు సాధించటం ద్వారా విస్తతమైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చని సెంటర్ ఫర్ నానో అండ్ సెల్ఫ్ మేటర్ సైన్సెస్ (బెంగుళూర్) డైరెక్టర్ ఆచార్య బీఎల్వీ ప్రసాద్ అన్నారు. కెబిఎన్ కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా నానో టెక్నాలజీ ఆవిష్కరణలపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బీల్వీ ప్రసాద్ మాట్లాడుతూ నానో సాంకేతిక పరిజ్ఞానంలో విస్తతమైన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. అవి మరింతగా పెరగాల్సిన అవసరముందన్నారు. వాటిపై విద్యార్థులు దష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.కష్ణవేణి, అధ్యాపకులు ఓ.శైలజ, స్వాతి, కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బీఎల్వీ ప్రసాద్

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలంలో కంచల, మాగల్లు గ్రామాలలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ఎదురుగా టిడిపి ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఒ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నందిగామ మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక ర్యాంపుల అనుమతులు గత సంవత్సరం డిసెంబర్ 26తో ముగిసిపోయినా, అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రోజూ పదుల నుంచి వందల సంఖ్యలో అక్రమ రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. అనుమతులు లేకపోయినా ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు అనుగుణంగా పెద్ద జెసిబిలను పెట్టి ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. ఈ విషయాలపై మాట్లాడుతుంటే వైసిపి నాయకులు తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లైఫ్‌స్టైల్‌లో సరికొత్త కలెక్షన్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని లైఫ్‌స్టైల్ షోరూమ్‌లో సరికొత్త కలెక్షన్స్‌ను ఆవిష్కరించినట్లు షోరూమ్ ప్రతినిధి ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవి సందర్భంగా సమ్మర్ వేర్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. లైఫ్‌స్టైల్ యాక్టివ్‌వేర్ దుస్తులతో బ్లూస్, వైట్స్ నాటికల్ కలర్ ప్యాలెట్‌లో సరికొత్త కలెక్షన్స్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ట్రాక్ ప్యాంట్‌లు, సాధారణ స్వెట్ షర్టులను కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు. స్ప్రింగ్ సమ్మర్ ఫ్యాషన్ పేరుతో అందరికీ అనువైన ధరల్లో లభ్యమవుతాయని తెలిపారు.

క్రోమాలో సమ్మర్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

టాటా గ్రూపుకు చెందిన ఎలక్ట్రానిక్ సంస్థ క్రోమా మ్యాజికల్ సమ్మర్ సేల్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ఎస్.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు విస్తృత ఆఫర్లను హెూమ్ అప్లయెన్సస్‌పై అందిస్తున్నామన్నారు. విస్తృతశ్రేణి ఎయిర్ కండీషనర్లు, రూమ్ కూలర్లు, రిఫ్రిజిరేటర్లపై 45 శాతం వరకు తగ్గింపును వినియోగదారులు సమ్మర్ సేల్‌లో పొందవచ్చని తెలిపారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు ఎక్సేంజ్ ద్వారా క్యాష్ బ్యాక్ ఆఫర్లు పొందవచ్చన్నారు. అలాగే 18 నెలల ఇఎంఐ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

31 వాహనాలకు వేలం

ప్రజాశక్తి-వీరులపాడు

నందిగామ నియోజకవర్గ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 31 వాహనాలకు రూ.11.26 లక్షల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఎస్సైలు సోమేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-సింగ్‌నగర్

వాంబే కాలనీ జి బ్లాక్‌లో నివాసముంటున్న ఎర్రగళ్ల లక్ష్మి (70) గురువారం మృతిచెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో విషయం తెలుసుకున్న నున్న ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్ మానవతా దక్పథంతో తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.